సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం | 7 | మే | 2023



వంతెనకు మోక్షం

పాలకొల్లు మండలం సగంచెరువు గ్రామంలో వంతెన నిర్మాణానికి ఇన్నేళ్లకు మోక్షం కలిగింది. దీంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. 8లో ▸



పోటెత్తిన భక్తులు

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. అన్ని విభాగాలూ కిటకిటలాడాయి. 8లో ▸



నిరాటంకంగా విద్యుత్ సరఫరా

ఎలాంటి ఆటంకాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఆదేశించారు. 8లో ▸

న్యూస్‌రీల్

రైతులూ.. అధైర్యపడొద్దు



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

నరసాపురం రూరల్: అకాల వర్షాల వల్ల పంట నష్టం జరిగిన రైతులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం ఆదుకునేందుకు చర్యలు చేపట్టిందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. పసలదీవిలో వర్షాలకు దెబ్బతిన్న వరి చేలను ఆమె పరిశీలించారు. తడిసిన ధాన్యం నష్టపోకుండా ఉండేలా రైతులు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. చేలల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వం తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించిందన్నారు. రైతులు ధాన్యాన్ని తక్కువ ధరకు దళారులకు అమ్ముకోవద్దన్నారు. ఆర్డీఓ దాసి రాజు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ఫాజిల్, ఎంపీడీఓ శివప్రసాద్‌యాదవ్ ఉన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా..

వీరవాసరం: రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆదివారం కూడా ధాన్యం కొనుగోలు చేసేందుకు రైతు భరోసా కేంద్రాలు పని చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. నందమూరుగరువులోని ఆర్‌బీకే కేంద్రంలో ధాన్యం కొనుగోలు తీరును ఆమె పరిశీలించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో ధాన్యం కొనుగోలు చేయాలని, ఆఫ్‌లైన్‌లో కొన్న ధాన్యాన్ని సాయంత్రంలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఎక్కడా రోడ్ల పక్కన ధాన్యం ఉండకుండా కొనుగోలు వేగవంతం చేయాలని ఆదేశించారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం


ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గ్రంథాలయాలను అభివృద్ధి చేయడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మనం–మన గ్రంథాలయం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శేషగిరిరావు మాట్లాడుతూ ప్రతి నెలా మొదటి శనివారం ఈ కార్యక్రమాన్ని కొనసాగించడానికి నిర్ణయించామన్నారు. గ్రంథాలయాలను పరిశుభ్ర పరచడం, పుస్తకాలను క్రమబద్ధీకరించడం, గ్రంథాలయ సభ్యత్వం పెంచడం, పాఠకుల పఠనాసక్తిని పెంపొందించడం ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ఈనెల 8 నుంచి జూన్ 11వ తేదీ వరకు జరిగే ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం పోస్టర్లను, కరపత్రాలను ఆవిష్కరించారు. పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ చీర్ల పద్మశ్రీ అధ్యక్షత వహించగా గ్రంథాలయ పరిషత్ సభ్యుడు వై.నరసింహారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు డీఎస్పీగా శ్రీనివాసులు

ఏలూరు టౌన్: రాష్ట్రవ్యాప్తంగా పోలీసు శాఖలో డీఎస్పీల బదిలీలు చేపట్టారు. ఏలూరు జిల్లాలో ఏలూరు, పోలవరం సబ్ డివిజినల్ పోలీస్ అధికారులను నియమిస్తూ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు డీఎస్పీగా ఈ.శ్రీనివాసులు నియమితులయ్యారు. ఆయన ఇప్పటివరకూ వెయిటింగ్‌లో ఉండగా తాజా బదిలీల్లో పోస్టింగ్ దక్కింది. కొంతకాలంగా ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీగా జీవీఎస్ పైడేశ్వరరావు బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన ప్రస్తుతం ఏలూరు సీసీఎస్ డీఎస్పీగా తన విధులను యథావిధిగా నిర్వర్తిస్తారు. ఏలూరు డీఎస్పీగా పోస్టింగ్ తీసుకున్న డీఎస్పీ శ్రీనివాసులు త్వరలోనే బాధ్యతలు స్వీకరిస్తారని చెబుతున్నారు. పోలవరం డీఎస్పీగా ఎ.శ్రీనివాసులు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన పత్తికొండ డీఎస్పీగా పనిచేస్తున్నారు. ఇక ఇటీవల పోలవరం డీఎస్పీగా బదిలీపై వచ్చిన కె.హనుమంతరావు విజయవాడ వెస్ట్ ఏసీపీగా బదిలీ కావటం విశేషం.

అభివృద్ధి బాటలు

అద్దాల్లా రోడ్లు
- రూ.8 కోట్లతో 94 రోడ్ల మరమ్మతులు
- రూ.12 కోట్లతో భీమవరం–పిప్పర రోడ్డు
- 95 శాతం మరమ్మతులు పూర్తి
- సాఫీగా సాగుతున్న ప్రయాణం





గొల్లలకోడేరు–నవుడూరు రహదారి, (అంతరచిత్రం) భీమవరం–పిప్పర రోడ్డు

భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా చేపట్టిన రోడ్ల మరమ్మతుల పనులు 95 శాతం మేర పూర్తయ్యాయి. రహదారులను పునర్నిర్మించడంతో పాటు గోతులను పటిష్టంగా పూడ్చుతున్నారు. జిల్లాలో 220 వరకు రోడ్లు ఉండగా అత్యవసర మార్గాలకు ప్రాధాన్యమిస్తూ పనులు చేస్తున్నారు. దాదాపు పనులన్నీ పూర్తికావచ్చాయి. దీంతో ప్రయాణం సాఫీగా సాగుతుందని ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- జిల్లాలో రూ.8 కోట్లతో 94 రోడ్లకు మరమ్మత్తులు చేపట్టారు.
- 62 ప్రధాన జిల్లా రోడ్లకు రూ.5 కోట్లు ఖర్చు చేశారు.
- 32 స్టేట్ హైవే రోడ్లకు రూ.3 కోట్లతో మరమ్మతులు పూర్తిచేశారు.
- సీఆర్ఎఫ్(సెంట్రల్ రోడ్డు ఫండ్స్) రూ.12 కోట్లతో భీమవరం–పిప్పర రోడ్డును 9 కిలోమీటర్లు మేర వెడల్పు చేసి నూతన నిర్మాణం చేపట్టారు.
- భీమవరం పట్టణంలోని బైపాస్ రోడ్డును రూ.3.65 కోట్లు ఖర్చు చేసి పటిష్టం చేయడంతో పాటు సీసీ, బీటీ రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు.

ముందస్తు ప్రణాళికలతో..

రానున్న వర్షాకాలంలో ఇబ్బందుల దృష్ట్యా ఆర్‌అండ్‌బీ అధికారులు ముందస్తు అంచనాలు ప్రతిపాదనలు తయారుచేసి మరమ్మతుల పనులు చేపట్టారు. నిధులు మంజూరైన వెంటనే యుద్ధప్రాతిపదికన పనులకు చర్యలు తీసుకుంటున్నారు.

దాదాపు మరమ్మతులు పూర్తి



జిల్లాలో చేపట్టిన రోడ్ల మరమ్మతులు దాదాపు పూర్తి చేశాం. 220 రోడ్లుగాను అత్యవసరమైన 94 రోడ్లకు సంబంధించి రూ.8 కోట్లు ఖర్చు చేశాం. వర్షాకాలంలో రోడ్ల ఇబ్బందులు లేకుండా మరమ్మతులు చేపట్టడానికి అంచనాలు తయారు చేసి నిధులు మంజూరుకు ప్రతిపాదించాం. ఎక్కడికక్కడ మరమ్మతులు పనులు చేస్తున్నాం.

– ఎస్.లోకేశ్వరరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ, భీమవరం

రోడ్ల ఛిద్రానికి చంద్రబాబే కారణం

జిల్లాలో రోడ్ల అధ్వాన స్థితికి చంద్రబాబే కారణమని స్పష్టంగా తెలుస్తోంది. చంద్రబాబు గత ఐదేళ్ల పాలనలో జిల్లాలో రోడ్ల నిర్మాణాలు పూర్తిగా జరగలేదు. నాణ్యతాలేమితో అరకొర నిర్మాణాలతో సరిపెట్టారు. రెండు, మూడు లేయర్లు వేయాల్సిన చోట ఒకటి, రెండు లేయర్లతో సరిపెట్టారు. ఉదాహరణకు గొలల్లకోడేరు నుంచి నవుడూరు వెళ్లే రోడ్డును రెండు లేయర్లకు గాను ఒక లేయర్‌తో సరిపెట్టారు. దీంతో ఏడాదిలోనే రోడ్డు అధ్వానంగా మారింది. ఇలాగే జిల్లాలోని పలు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. భారీ వర్షాలతో మరింత ఛిద్రం కాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేస్తూ రహదారుల అభివృద్ధికి కృషిచేస్తున్నారు.

వేగంగా ధాన్యం తరలింపునకు చర్యలు

మంత్రి కారుమూరి



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి

ఇరగవరం: కోసిన ధాన్యాన్ని కోసినట్లు రైసు మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకుంటున్నామని పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఇరగవరం, కొత్తపాడు, అయినపర్రు, కంతేరు గ్రామాల్లో ఆయన పర్యటించి అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, కోసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. కృష్ణా జిల్లా నుంచి 10 లక్షల గోనె సంచులు వస్తున్నాయన్నారు. పూర్తిస్థాయిలో ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. అయితంపూడిలో ఓ రైసుమిల్లర్ సారకు రూ.40 వసూలు చేస్తున్నారని రైతులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. నూక నెపంతో కొందరు మిల్లర్లు రైతులను పిలుస్తున్నారని, అటువంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

చంద్రబాబుది మొసలికన్నీరు

- వ్యవసాయం దండగని.. ఇప్పుడు రైతులను రెచ్చగొడతున్నారు
- అకాల వర్షాలనూ రాజకీయాలకు వాడుకుంటారా?
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి ఆగ్రహం



తణుకులో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు అర్బన్: వ్యవసాయం దండగని చెప్పిన ప్రతిపక్ష నేత చంద్రబాబు.. ఇప్పుడు రైతులపై ప్రేమ ఉన్నట్లుగా మొసలికన్నీరు కారుస్తూ రైతాంగాన్ని రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. తణుకు మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల రైతులు ఇబ్బందులు పడుతుండటాన్ని అవకాశంగా చేసుకుని చంద్రబాబు రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. చంద్రబాబు మొసలికన్నీరును నమ్మే రైతులు ఎవరూ లేరని చెప్పారు. రైతాంగ సమస్యలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడుతూ పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారని తెలిపారు. రైతుల నుంచి ధాన్యాన్ని నేరుగా ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయించి గిట్టుబాటు ధర ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. చంద్రబాబు హయాంలో రైతులకు రూ.85 వేల కోట్లు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి, దానిని రూ.18 వేల కోట్లకు కుదించి, అది కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని దుయ్యబట్టారు. 'అమరావతి భూముల కుంభకోణం, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణం వంటి కేసుల్లో చంద్రబాబు ముందస్తు స్టే తెచ్చుకుని ఇప్పటివరకు గడిపేశారు. ఇకపై కోర్టు స్టేలు ఎత్తివేసిన నేపథ్యంలో జైలు ఊచలు లెక్కించాల్సిందే..' అని మంత్రి కారుమూరి హెచ్చరించారు. ఏ క్షణంలో అయినా తనను అరెస్ట్ చేస్తారనే భయంతో జనంలో ఉండాలనే అకాల వర్షాలను కూడా చంద్రబాబు రాజకీయానికి వాడుకుంటున్నారని మండిపడ్డారు. 'వ్యవస్థలను మేనేజ్ చేస్తూ ఇప్పటివరకు నీ ఇష్టమొచ్చినట్టు ఆడావు.. ఇక నీ ఆటలు కట్' అంటూ చంద్రబాబుపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

ప్రవేశ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు



అధికారులతో మాట్లాడుతున్న డీఆర్వో కృష్ణవేణి

సాక్షి, భీమవరం: ప్రవేశ పరీక్షల (సెట్) నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు కీలకమని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి అన్నారు. భీమవరంలోని స్పందన సమావేశ మందిరంలో శనివారం అధికారులతో సమీక్షించారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే పరీక్షకు జిల్లాలో భీమవరం భారతీయ విద్యాభవన్స్, తణుకు తేతలిలో స్టెప్పింగ్ స్టోన్స్ హైస్కూల్, తణుకులో ముళ్లపూడి వెంకటరాయ మెమోరియల్ పాలిటెక్నిక్, తణుకు పైడిపర్రులోని శ్రీరామ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాలల్లో కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు.

పాలిసెట్‌కు 19 కేంద్రాలు

ఈనెల 10న జరిగే పాలిసెట్–2023కు జిల్లాలో 19 కేంద్రాలను ఏర్పాటు చేశామని డీఆర్వో తెలిపారు. భీమవరంలో 6, తణుకులో 8, తాడేపల్లిగూడెంలో ఒకటి, నరసాపురంలో 4 కేంద్రాలు ఉన్నాయన్నారు. 6,462 మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు.

15 నుంచి ఈఏపీసెట్

ఈనెల 15 నుంచి 19 వరకు ఏపీఈఏపీసెట్ (ఎంపీసీ), 22, 23 తేదీల్లో ఏపీఈఏపీసెట్(బైపీసీ), జూన్ 6న ఏపీఐసెట్, ఈనెల 24, 25 తేదీల్లో ఏపీఐసెట్, ఈనెల 28 నుంచి 30 వరకు ఏపీపీజీఈసెట్, జూన్ 3వ వారంలో ఏపీఎడ్‌సెట్, మే 20న ఏపీలాసెట్/పీజీఎల్‌సెట్, జూన్ 6 నుంచి 10 వరకు ఏపీపీజీసెట్, మే 31 నుంచి ఏపీఈసెట్‌లకు పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. పాలీసెట్ పరీక్షల నిర్వహణ సమన్వయ అధికారి, తాడేపల్లిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డి.ఫణిందర్ ప్రసాద్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ నజీరున్నిషా, చీఫ్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

బాలికలదే హవా

- పదో తరగతి పరీక్షా ఫలితాలు
- జిల్లాలో 65.95 శాతం ఉత్తీర్ణత



భీమవరం పొట్టిశ్రీరాములు గరల్స్ హైస్కూల్‌లో విద్యార్థినులు (ఫైల్)

సాక్షి, భీమవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో బాలికలదే పైచేయిగా నిలిచింది. జిల్లాలో 65.95 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా వీరిలో బాలికలు 70.2 శాతం, బాలురు 61.97 శాతం ఉన్నారు. ఫలితాల్లో రాష్ట్రంలో పశ్చిమగోదావరి జిల్లా 21వ స్థానంలో నిలిచిందని డీఈఓ ఆర్.వెంకటరమణ శనివారం తెలిపారు. మొత్తం 20,268 మంది హాజరుకాగా 13,362 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. జిల్లావ్యాప్తంగా 19 పాఠశాలల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించగా రెండు ప్రైవేట్, ఐదు ఎయిడెడ్ పాఠశాలల్లో జీరో ఉత్తీర్ణత నమోదైందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఫలితాల్లో సత్తాచాటారు.

రీకౌంటింగ్‌కు 13 వరకు అవకాశం

రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోడానికి ఈనెల 13వ తేదీ వరకు అవకాశముందని డీఈఓ వెంకటరమణ తెలిపారు. రీ కౌంటింగ్‌కు సబ్జెక్టుకు రూ.500, రీవెరిఫికేషన్‌కు రూ.1,000 చొప్పున చెల్లించాలన్నారు. వచ్చేనెల 2 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని, ఈనెల 7 నుంచి 17 వరకు అపరాధ రుసుం లేకుండా, 18 నుంచి 22 వరకు రూ.50 అపరాధ రుసంతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చని వివరించారు.

'పది' ఫలితాలు ఇలా..

హాజరైన విద్యార్థులు	20,268
బాలురు	10,293
బాలికలు	9,975
ఉత్తీర్ణులైనవారు	13,362
బాలురు	6,360
బాలికలు	7,002
ఉత్తీర్ణతా శాతం	65.95
ప్రథమ శ్రేణి	9,998
ద్వితీయ శ్రేణి	2,291
తృతీయ శ్రేణి	1,073

వేడుకగా శ్రీచక్రస్నానం



శ్రీచక్రస్నానం జరిపిస్తున్న అర్చకులు



నవనీత కృష్ణుని అలంకరణ

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీచక్రస్నానాన్ని వేడుకగా నిర్వహించారు. యాగశాలలో శ్రీవారు, అమ్మవార్లు, శ్రీచక్ర పెరుమాళ్లను వేదికపై వేంచేపు చేసి పూజాదికాలు నిర్వహించి అభిషేక తీర్థంతో శ్రీచక్ర స్వామిని అభిషేకించారు. అనంతరం తిరుమంజనాలు జరిపి హారతులిచ్చారు. అభిషేక జలాన్ని భక్తుల శిరస్సులపై చల్లారు. ముందుగా శ్రీవారి తిరువీధి సేవ నేత్రపర్వంగా జరిగింది. సాయంత్రం ఆలయంలో నిత్యహోమ బలిహరణలు, పూర్ణాహుతి, అనంతరం ధ్వజ అవరోహణ వేడుకలను నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో శ్రీవారి నవనీత కృష్ణ అలంకారం భక్తులకు కనువిందు చేసింది. రాత్రి అశ్వవాహనంపై తిరువీధి సేవ వర్షం కారణంగా రద్దయ్యింది. ఆదివారం రాత్రి జరిగే శ్రీపుష్ప యాగోత్సవంతో ఈ బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని, సోమవారం నుంచి ఆలయంలో నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను పునరుద్ధరిస్తామని దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి శ్రీవారికి చూర్ణోత్సవం, వసంతోత్సవం, రాత్రి 7 గంటల నుంచి ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్ప యాగం, పవళింపు సేవ జరుగనున్నాయి.

ధర్మ పరిరక్షణతోనే మానవ మనుగడ : హిందూ ధర్మ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని అర్చకులు, పండితులు ఉద్బోధించారు. శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో ఆలయ అధికారులు, అర్చకులు, పండితులు సాయంత్రం వేదసభను ఘనంగా నిర్వహించారు. రథోత్సవం జరిగిన మరుసటి రోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంప్రదాయం. కల్యాణ మండపంలో రజిత సింహాసనంపై కల్యాణమూర్తులను వేంచేపుచేసి, విశేష పుష్పాలంకారాలు చేశారు. వేదిక ముందు అర్చకులు, వేద పండితులు, అధికారులు, ఆగమ విద్యార్థులు కొలువు తీరారు. స్వామి, అమ్మవార్ల గుణగణాలను కీర్తిస్తూ.. వేద మంత్రోచ్చరణలు జరిపారు. అనంతరం ఉత్సవమూర్తులకు నీరాజన మంత్రపుష్పాలను సమర్పించారు. చివరిలో అర్చకులు, పండితులను ఆలయ అధికారులు సత్కరించారు.



వేద సభను నిర్వహిస్తున్న పండితులు

11న జిల్లాస్థాయి చెస్ పోటీలు

సాక్షి, భీమవరం: జిల్లా చెస్ అసోసియేషన్, అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన భీమవరంలో జిల్లా మహిళల చదరంగం పోటీలు నిర్వహించనున్నట్టు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ శనివారం తెలిపారు. ఈ పోటీల్లో విజేతలు ఈనెల 18వ తేదీ నుంచి నాలుగు రోజులపాటు విజయవాడలో జరిగే రాష్ట్ర సీనియర్ మహిళల చెస్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. అలాగే ఈనెల 14వ తేదీన భీమవరంలోని ఆర్యవైశ్య యువజన సంఘం భవనంలో జిల్లా సీనియర్ ఓపెన్ చెస్ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో విజేతలు ఈనెల 26వ తేదీ నుంచి తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పోటీలకు సంబంధించిన మరిన్ని వివరాలకు సెల్ 90632 24466 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

శ్రీవారి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రం శనివారం భక్తులతో పోటెత్తింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తుల రాక మొదలవడంతో క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, వైకుంఠం క్యూకాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, అనివేటి మండప ప్రాంతంతో పాటు, కేశఖండనశాల ఇతర విభాగాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది. ఆదివారం భక్తుల రద్దీ మరింత అధికంగా ఉండే అవకాశం ఉందని ఆలయ వర్గాలు భావిస్తున్నాయి.

రేషన్ బియ్యం పట్టివేత

ముసునూరు: అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం పట్టుకుని సీజ్ చేసినట్లు నూజివీడు సీఎస్ డీటీ గుండుబోయిన వెంకటేశ్వరరావు చెప్పారు. మండలంలోని సూరేపల్లి గ్రామానికి చెందిన ఓబిళ్లనేని రామకృష్ణ ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన 1,450 కిలోల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో శనివారం దాడి చేసి పట్టుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రజలకు పంపిణీ చేయాల్సిన బియ్యం పక్కదారి పడితే సహించేది లేదని, క్రిమినల్ కేసులు విధించడంతోపాటు, కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పట్టుకున్న బియ్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

సగంచెరువు వంతెనకు మోక్షం

గత ప్రభుత్వాలు అభివృద్ధి పనులకు

శంకుస్థాపనలు చేసి శిలాఫలాలతో సరిపెట్టాయి. నిధుల మంజూరు, పనులు పూర్తి చేయడంలో విఫలమయ్యాయి. కొన్ని పనులకు నిధులు మంజూరు చేసినా వాటిని పూర్తి చేయడంలో చతికిలపడ్డాయి. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు అత్యంత ప్రాధాన్యమివ్వడమే కాక గత ప్రభుత్వాల హయాంలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలపైనా వైఎస్ జగన్ ప్రభుత్వం దృష్టి సారించి ఆయా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో వాటికి మోక్షం లభిస్తోంది. ముఖ్యంగా పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం సగంచెరువు గ్రామంలో నిడదవోలు – నరసాపురం ప్రధాన కాలువలపై నిర్మించిన వంతెన ఆ కోవకే చెందుతుంది.



సగంచెరువు గ్రామంలో పంటకాలువపై నిర్మించిన వంతెన



వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

- గత ప్రభుత్వాల హయాంలో అభివృద్ధి పనుల విస్మరణ
- శంకుస్థాపనలతో సరి.. నిర్మాణాల పూర్తిపై కొరవడిన శ్రద్ధ
- గ్రామాల్లో దీర్ఘకాలిక సమస్యలపై వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- సగంచెరువు వంతెన నిర్మాణం పూర్తితో ప్రజల్లో హర్షాతిరేకాలు

పాలకొల్లు అర్బన్ : సగంచెరువు గ్రామంలో ఈ వంతెన నిర్మాణానికి 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు చేసి అప్పటి ఆర్అండ్‌బీ మంత్రిగా ఉన్న ధర్మాన ప్రసాదరావు శంకుస్థాపన చేశారు. అయితే పనులు పూర్తి కాలేదు. 2017లో టీడీపీ ప్రభుత్వ హయాంలో మరోసారి శంకుస్థాపన చేసినా పనుల నిర్మాణంలో జాప్యం చోటుచేసుకుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ వంతెన నిర్మాణ పనులు పురోగతిపై దృష్టి సారించింది. దీంతో పనులు చకచకా సాగాయి. అప్రోచ్ రోడ్డుతో సహా 210 మీటర్ల పొడవు, 7.5 మీటర్ల వెడల్పుతో వంతెన నిర్మించారు. భారీ వాహనాలు సైతం ఈ వంతెనపై నుంచి రాకపోకలు సాగించడానికి వీలుగా వంతెన నిర్మించారు.

గ్రామీణ ప్రాంతాలను అనుసంధానం చేస్తూ..

అంబేడ్కర్ కోనసీమ జిల్లా, పశ్చిమగోదావరి జిల్లాలతో పాటు కృష్ణా జిల్లా ప్రజలకు ఈ వంతెన సేవలందించనుంది. ముఖ్యంగా భారీ వాహనాలతో పాటు ఆర్టీసీ బస్సులు, కొబ్బరి, ధాన్యం లోడుతో ట్రాక్టర్లు, లారీలు, గడ్డి ట్రాక్టర్లు, ఫైరింజన్, ఇతర అన్ని రకాల వాహనాల రాకపోకలకు అనుకూలంగా ఈ వంతెన నిర్మించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలను కలుపుతూ ఈ వంతెన నిర్మించడం వల్ల 216, 216ఏ జాతీయ రహదారిలోని గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరం కానుంది. ఇటీవల ఈ వంతెనను రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ చేతుల మీదుగా ప్రారంభించడం తెలిసిందే. దీంతో ప్రజల రాకపోకలకు మార్గం సుగమమైంది.

ఆనందంగా ఉంది



ఏడాది క్రితం గ్రామానికి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యా. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన వంతెన పనులు పూర్తి కాలేదు. ప్రజల ఇబ్బందులు గ్రహించాను. అప్పట్లో రూ.16 లక్షలు నా సొంత సొమ్ముతో కాలిబాట వంతెన నిర్మించా. ప్రస్తుతం వంతెన నిర్మించడంతో వాహనాలు నేరుగా గ్రామంలోకి వస్తున్నాయి. దీని వల్ల ప్రజల ఇబ్బందులు పూర్తిగా తొలగిపోయాయి.

– కదలి నాగమణి, సర్పంచ్, సగంచెరువు

ఆర్టీసీ బస్సు నడపాలి



సగంచెరువులో గర్భిణులు, రోగులు, వృద్ధులను నరసాపురం రోడ్డులోని బస్ పాయింట్‌కి తీసుకువెళ్లడానికి సమయానికి వాహనాలు అందుబాటులో లేక చాలా ఇబ్బందులు పడేవాళ్లం. దీంతో గత పదేళ్ల నుంచి చాలా సమస్యలు ఎదుర్కొన్నాం. ఇప్పుడు వంతెన పూర్తికావడంతో రవాణా సౌకర్యం మెరుగుపడింది. గ్రామం మీదుగా ఆర్టీసీ బస్సు నడిపితే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

– గుదాల సుబ్బలక్ష్మి, గృహిణి, సగంచెరువు

ఇబ్బందులు తప్పాయి



గ్రామంలోకి రావడానికి నలభై ఏళ్ల క్రితం నిర్మించిన కాలిబాట వంతెన శిథిలమైంది. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల హయాంలో వంతెన నిర్మాణంపై దృష్టి పెట్టలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చొరవ తీసుకుని వంతెన నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో గ్రామంలోకి రాకపోకలకు ఇబ్బందులు తప్పాయి.

– పెచ్చెట్టి నాగరాజు, గ్రామస్తుడు

ఫైరింజిన్ కూడా వచ్చేది కాదు



వంతెన అనువుగా లేకపోవడంతో గత పదేళ్ల నుంచి భారీ వాహనాలు గ్రామంలోకి వచ్చేవి కావు. దీంతో ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే ఫైరింజన్ రావడానికి కూడా అవకాశం లేక ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం వంతెన నిర్మించడంతో అన్ని రకాల వాహనాలు గ్రామంలోకి వస్తున్నాయి. దీంతో ప్రజలందరికీ ఎంతో ఉపయోగంలోకి వచ్చింది.

– సానబోయిన మధు, గ్రామస్తుడు

మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు టౌన్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ పథకంలో మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టామని ఏలూరు డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ డీ.ఆశ చెప్పారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 11 మెడికల్ ఆఫీసర్ పోస్టులను ఒక ఏడాది కాంట్రాక్ట్ విధానంలో భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. అభ్యర్థులు ఎంబీబీఎస్ పూర్తి చేసి 2023 ఏప్రిల్ 30 నాటికి ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి ఉండాలని, ఏపీ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు 'వెస్ట్‌గోదావరి డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్' వెబ్‌సైట్‌లో దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని దరఖాస్తు చేయాలన్నారు. తమ విద్యార్హతల సర్టిఫికెట్లను ఒక సెట్ జిరాక్స్ కాపీలు ఏలూరులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఈనెల 8 తేదీ నుంచి 12వ తేదీ వరకూ ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 5గంటల లోపు అందజేయాలన్నారు. జిల్లా వెబ్‌సైట్‌లో సూచించిన ఉద్యోగాలకు సరైన అర్హత ధ్రువపత్రాలు జత చేయకపోయినా, దరఖాస్తును సరైన రీతిలో పూరించకపోతే దరఖాస్తులు తిరస్కరిస్తామని స్పష్టం చేశారు. భర్తీ చేసే పోస్టుల సంఖ్య పెంచేందుకు, తగ్గించేందుకు ఇతర అన్ని విషయాలకు జిల్లా నియామక కమిటీకి అధికారం ఉందని డీఎంహెచ్‌వో డాక్టర్ ఆశ తెలిపారు.

ఆన్‌లైన్‌లో తుది మెరిట్ జాబితా..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ పథకంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో వివిధ రకాల పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డీ.ఆశ చెప్పారు. ఒక ఏడాది కాల పరిమితిలో కాంట్రాక్ట్ విధానంలో పోస్టులను భర్తీ చేస్తున్నామని, అర్హులైన అభ్యర్థుల తుది మెరిట్ లిస్ట్ శనివారం ఉదయం ఆన్‌లైన్‌లో మెరిట్ లిస్ట్ ఉంచామని, అభ్యర్థులు పరిశీలించుకోవాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్, మత్తు వైద్యుడు, ఫిజియోథెరపిస్ట్, పునరావాస కార్యకర్త, డీఈవో, క్వాలిటీ మేనేజర్, క్వాలిటీ కన్సల్టెంట్ క్యూఏ, థియేటర్ అసిస్టెంట్, ఓటీ టెక్నీషియన్, క్లీనర్, ల్యాబ్ అసిస్టెంట్, శానిటరీ అసిస్టెంట్ పోస్టులకు మెరిట్ జాబితా విడుదల చేశామన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయండి

జిల్లా జడ్జి పి.పురుషోత్తమకుమార్



ఏలూరు (మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమ కుమార్ అధ్యక్షతన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని న్యాయమూర్తులతో వర్క్ రివ్యూ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో శనివారం జరిగిన ఈ సమావేశానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా అన్ని న్యాయస్థానాలలోని న్యాయమూర్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని కోర్టు పరిధిలో ఉన్న సివిల్, క్రిమినల్ కేసులను త్వరగా విచారణ చేసి తీర్పు ఇవ్వాల్సిన విధి విధానాలపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ చర్చించారు. అలాగే అందుబాటులో ఉన్న సాంకేతికతను ఉపయోగించుకుని కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామ్‌గోపాల్, రెండవ అదనపు జిల్లా జడ్జి పి.మంగాకుమారి, ఇతర న్యాయమూర్తులు పాల్గొన్నారు.

సీపీఎం నేత అవినీతిపై గ్రామస్తుల ఫిర్యాదు

ముదినేపల్లి రూరల్: మండలంలోని దేవపూడికి చెందిన సీపీఎం సీనియర్ నేత ఉల్లంకి నాంచారయ్యపై పలు ఆరోపణలతో ఆ పార్టీ కేంద్ర కమిటీకి గ్రామస్తులు శనివారం ఫిర్యాదు చేశారు. ఒక ఎకరం భూమి మాత్రమే కలిగి ఉన్న నాంచారయ్య పార్టీని అడ్డుపెట్టుకుని ప్రస్తుతం 18 ఎకరాలు అక్రమంగా సంపాదించినట్లు రుజువులు చూపుతూ ఫిర్యాదుకు జతచేశారు. నాంచారయ్య 1985లో సీపీఎంలోకి ప్రవేశించి ప్రస్తుతం జిల్లా రైతువిభాగ ప్రధాన కార్యదర్శిగా చెప్పుకుంటూ రైతులను బెదిరిస్తూ దందాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వైవాకలో ఉద్యమాల పేరిట దళితులను మభ్యపెట్టి ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా చెరువులు తవ్వి లీజుకు ఇచ్చి ఆదాయాన్ని పొందుతున్నాడన్నారు. గ్రామంలో సుందరయ్య విజ్ఞాన భవన్ నిర్మించి ఇందులో గదులపై అద్దె ద్వారా వచ్చే ఆదాయాన్ని పార్టీకి జమచేస్తున్నట్లు గ్రామస్తులను మభ్యపెడుతూ సొంతానికి వాడుకుంటున్నట్లు ఆరోపించారు. పార్టీని, దళితులను అడ్డుపెట్టుకుని వైవాక, దేవపూడి, పెదతుమ్మిడి వంటి గ్రామాల్లోని రైతులను బెదిరించి అక్రమార్జనలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. దందాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న నాంచారయ్యపై తగిన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుదాఘాతానికి నర్సింగ్ విద్యార్థిని మృతి

ఏలూరు టౌన్: ఏలూరులోని బంధువుల ఇంట్లో ఉంటూ నర్సింగ్ విద్య అభ్యసిస్తున్న విద్యార్థిని ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన బొద్దపాటి శ్రీనివాస్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె లావణ్య (20) ఏలూరు రెడ్‌క్రాస్ సొసైటీ నర్సింగ్ కాలేజీలో ఏఎన్ఎం ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఏలూరు పాములదిబ్బ ప్రాంతంలోని బంధువుల ఇంటి వద్ద ఉంటూ ప్రతి రోజూ కాలేజీకి వెళుతోంది. శనివారం ఉదయం ఇంట్లో మోటారు వేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఏలూరు టూటౌన్ సీఐ పీ.చంద్రశేఖర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

మరో రెండు రోజులు ఇదే వాతావరణం

ఏలూరు (మెట్రో): ఏలూరు జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి మొదలైన వర్షం జిల్లాలోని 27 మండలాల్లో ప్రతి మండలంలో కురుస్తూనే ఉంది. సోమవారం భారీ స్థాయిలో 4 సెం.మీ వర్షపాతం నమోదైంది. శనివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ఏలూరుతో పాటు మరో 20 మండలాల్లో 1.50 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఇదే వాతావరణం మరో రెండు రోజులు కొనసాగుతుందని వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు. జిల్లా కేంద్రం ఏలూరులో మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన వర్షం సాయంత్రం ఆరు గంటల వరకు కురుస్తూనే ఉంది.

పశ్చిమగోదావరి జిల్లాలో..

సాక్షి, భీమవరం: జిల్లాలో శనివారం ఇరగవరం మండలంలో అత్యధికంగా 72 మి.మీ వర్షపాతం నమోదైంది. పెనుగొండలో 40 మి.మీ, పెనుమంట్ర 34.2, గణపవరం 33.6, పాలకోడేరు 19.6, అత్తిలి 27.2, పోడూరు 10, తణుకు 4.6 మి.మీ, వీరవాసరం 2.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: అదనంగా కట్నం తీసుకురావాలని వేధిస్తున్న భర్త, అత్తమామ, తోటికోడళ్లు, బావలపై వివాహిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. వివరాల ప్రకారం చల్లవారిగూడెం గ్రామానికి చెందిన సత్తెనపల్లి ప్రసాద్‌తో జయచంద్రకు 8 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. అయితే ఇటీవల ప్రసాద్ చెడు వ్యసనాలకు లోనై వేరే మహిళలతో వివాహేతర సంబంధం పెట్టుకుని అదనపు కట్నం తీసుకురమ్మని తనని వేధిస్తున్నాడని, ఇందుకు అత్తమామలు, ఆమె బావలు, తోటికోడళ్లు సహకరిస్తున్నారని జయచంద్ర పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై గతంలో పెద్దలు కూడా నచ్చజెప్పారని, అయినా తన భర్త, అతని కుటుంబసభ్యుల ప్రవర్తనలో ఎటువంటి మార్పు రాలేదని, మూడు నెలల క్రితం అందరూ కలిసి తనను కొట్టి ఇంటి నుంచి పంపించి వేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ములపర్రు సొసైటీలో సీఐడీ విచారణకు కోర్టు ఆదేశం

తణుకు: గత తెలుగుదేశం పార్టీ హయాంలో పెనుగొండ మండలం ములపర్రు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జరిగిన నిధుల దుర్వినియోగం వ్యవహారంపై సీఐడీ విచారణ చేపట్టాలని రాష్ట్ర ఉన్నతన్యాయ స్థానం ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జి.రామకృష్ణప్రసాద్ ఈనెల 3న తీర్పు వెలువరించినట్లు బాధితులు తాడేపల్లిగూడెంకు చెందిన మలిరెడ్డి సుబ్బారెడ్డి, కుటుంబ సభ్యులు శనివారం వెల్లడించారు. 2018లో అప్పటి సొసైటీ అధ్యక్షులు, కార్యదర్శి కలిసి సుమారు రూ.2.50 కోట్ల మేర నిధులు దుర్వినియోగం చేసినట్లు 51 ఎంక్వైరీలో తేల్చినప్పటికీ నిందితులపై చర్యలు తీసుకోకపోగా తమకు చెందిన సుమారు రూ.30 లక్షల డిపాజిట్లు చెల్లించకపోవడంతో హైకోర్టును ఆశ్రయించినట్లు సుబ్బారెడ్డి వెల్లడించారు. ఈ వ్యవహారంలో పిటిషనర్ తరఫున దాసరి ఎస్‌వీవీఎస్ఎన్ ప్రసాద్, కో–ఆపరేటివ్స్ తరఫున సహాయ ప్రభుత్వ న్యాయవాది పి.మహిధర్‌రెడ్డి వాదనలు వినిపించినట్లు చెప్పారు. దీంతో కేసు పూర్వాపరాలు పరిశీలించి నిందితులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సీఐడీ అధికారులను ఆదేశిస్తూ నాలుగు వారాల గడువు విధిస్తూ తీర్పు చెప్పారని ఆయన వెల్లడించారు. ఇదిలా ఉంటే ఒక ప్రాథమిక స్థాయి సహకార సంఘంలో జరిగిన ఆర్థిక మోసాలపై హైకోర్టు సీఐడీ విచారణకు ఆదేశించడం గమనార్హం.

నిరాటంకంగా విద్యుత్ సరఫరాకు చర్యలు

ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్



అధికారులతో సమీక్షిస్తున్న, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

సాక్షి, విశాఖపట్నం: ఎలాంటి ఆటంకాలు లేకుండా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ అధికారులను ఆదేశించారు. విశాఖలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సంస్థ పరిధిలోని ఐదు సర్కిళ్లకు సంబంధించిన అధికారులతో సీఎండీ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన, సత్వర సేవలను అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు. వేసవిలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను మెరుగుపరుచుకునేందుకు ప్రణాళికాబద్ధంగా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఫీడర్ వారీగా విద్యుత్ అంతరాయాలను సమీక్షించి వాటిని తగ్గించేందుకు అవసరమైన చర్యలను చేపట్టాలన్నారు. వినియోగదారులకు నిర్దేశిత ప్రామాణిక సమయంలో సేవలందించడంలో అలసత్వం ప్రదర్శించే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో వినియోగదారుల సమస్యలకు సంబంధించి సర్కిల్, డివిజన్ స్థాయిలో తరచూ సమీక్షలను నిర్వహించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలను అరికట్టేందుకు భద్రత అంశాలపై ఎనర్జీ అసిస్టెంట్లకు శిక్షణా కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ ప్రమాదాల నివారణ, విద్యుత్తు పొదుపు అంశాలపై వినియోగదారులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని సీఎండీ సూచించారు. వినియోగదారులు అడిగిన వెంటనే విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని, విద్యుత్ బకాయిల వసూళ్లకు ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో సంస్థ డైరెక్టర్లు బి.రమేష్ ప్రసాద్, డి.చంద్రం, ఏవీవీ సూర్యప్రతాప్, సీజీఎంలు వి.విజయలలిత, డి.సుమన్ కల్యాణి, అచ్చి రవికుమార్, ఓ.సింహాద్రి, జె.శ్రీనివాసరావు, బి.రామచంద్రప్రసాద్, ఎస్.మసిలామణి, ఎం.రామకృష్ణ, ఎ.వెంకటేశ్వరరావు, ఎం.రవీంద్ర, జనరల్ మేనేజర్లు, ఐదు సర్కిళ్ల ఎస్ఈలు, ఈఈలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జగనన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి



డీపీవో మల్లికార్జునరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కార్యదర్శులు, సిబ్బంది

పెంటపాడు : మండలంలోని అన్ని గ్రామాల్లో పరిశుభ్రతతో పాటు ప్రభుత్వ పథకాలైన హౌసింగ్ ద్వారా నిర్మిస్తున్న జగనన్న ఇళ్లను వేగవంతం చేసేలా అధికారులు కృషి చేయాలని డీపీవో, మండల హౌసింగ్ ప్రత్యేకాధికారి జీవీకే మల్లికార్జునరావు పేర్కొన్నారు. శనివారం మండల ప్రత్యేకాధికారిగా జగనన్న ఇళ్ల నిర్మాణాలపై సమీక్షా నిర్వహించారు. అనంతరం పలు విషయాలు చర్చించారు. ఈ సందర్భంగా పెంటపాడు ఎంపీపీ దాసరి హైమావతితో పాటు, పలువురు ఆయనకు మర్యాదపూర్వకంగా పుష్పగుచ్చాలు ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో టీ వీ సత్యనారాయణ,ఈవోపీఆర్డీ, హౌసింగ్, వ్యవసాయశాఖ, తదితర శాఖల సిబ్బంది, సచివాలయసిబ్బంది, హౌసింగ్, మండల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాకానుక సామగ్రి పరిశీలన



పెంటపాడులోని జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్ వద్ద నూతన పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న డీఈవో వెంకటరమణ

పెంటపాడు: మండలంలోని ప్రభుత్వ బేసిక్ స్కూల్ ఉంచిన జగనన్న విద్యా కానుక సామగ్రిని డీఈవో వెంకటరమణ శనివారం పరిశీలించారు. మండల పరిధిలో పాఠశాలకు అందించే సామగ్రిలో పుస్తకాలు, దుస్తులు, బూట్ల నాణ్యతను ఆయన పరిశీలించి మాట్లాడారు. సామగ్రిని ఎప్పటికప్పుడు పరిశీలించి పాఠశాల వారీగా పంపిణీకి ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎం. శ్రీనివాస్, సీఆర్‌పీలు రవి, సాయిరాం, బాలు, చిట్టెమ్మలు పాల్గొన్నారు.

2న అరుణాచల గిరి ప్రదక్షిణ యాత్రకు ప్రత్యేక బస్సు



అరుణాచల యాత్ర నుంచి వచ్చిన ప్రయాణీకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో అరుణాచల గిరి ప్రదక్షిణ యాత్ర ప్రత్యేక బస్సు సర్వీస్ జూన్ 2వ తేదీ సాయంత్రం తాడేపల్లిగూడెం బస్సు స్టేషన్ నుంచి రాత్రి 7 గంటలకు బయలుదేరుతుందని, 10వ తేదీన తిరిగి గూడెం చేరుతుందని డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి వెల్లడించారు. ఇటీవల అరుణాచలం గిరి ప్రదక్షిణ యాత్రా స్పెషల్ బస్సు 3వ తేదీన వెళ్లి శనివారం సురక్షితంగా గూడెం చేరుకున్నందున ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ఆ బస్సుకు స్వాగతం పలికారు. ఆధ్యాత్మిక యాత్రలో పాల్గొన్న ప్రయాణీకులు మాట్లాడుతూ యాత్ర తమకు మధురమైన అనుభూతి కలిగించిందని తెలిపారు. బస్సు డ్రైవర్ల మైత్రి పూర్వక ప్రవర్తన పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. డీఎం యేలూరి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ఆర్టీసీ ఆధ్వర్యంలో యాత్ర అపూర్వ ఆదరణ పొందుతుందన్నారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో యాత్రలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

8న యూపీఎఫ్ సమావేశం

పెంటపాడు: యునైటెడ్ పాస్టర్స్‌ఫెలోషిప్ సర్వసభ్య సమావేశం ఈనెల 8న ఉదయం 9 గంటలకు గూడెం భాగ్యలక్ష్మీపేట ఎల్‌ఎల్‌ఎం చర్చిలో నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు మల్లిపూడి జైబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి యుపీఎఫ్ సభ్యులు, దైవసేవకులు హాజరుకావాలని జైబాబు కోరారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు

- సకల సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం
- వేగంగా నాడు -నేడు పనులు



కార్పొరేట్ స్కూల్‌ను తలపిస్తున్న మీనవిల్లూరు ఎంపీపీ పాఠశాల ముఖద్వారం

పెంటపాడు: విద్యావ్యవస్థలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన సమూల మార్పుల ద్వారా పల్లెల్లో ప్రభుత్వ బడులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మారాయి. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు ప్రారంభించిన నాడు- నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు ఆహ్లాదకర వాతావరణంతో పాటు, అమ్మఒడి, విద్యాదీవెన వంటి పథకాల ద్వారా తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గించడమే కాకుండా విద్యార్థుల్లో స్థానికంగా చదవుకోవాలనే కుతూహలాన్ని రేకెత్తించే వాతావరణం కనిపిస్తోంది. మండలంలో నాడు -నేడులో మొదటివిడతగా 24 పాఠశాలలకు గాను తొలివిడతలో రూ.5.20 కోట్లతో పాఠశాలలు తీర్చిదిద్దగా రెండో విడతలో 45 పాఠశాలలకు గాను రూ. 17 కోట్లతో పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారు. పలు గ్రామాల్లో వేగంగా రెండో విడత పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం పలు గ్రామాల్లోని పాఠశాలల్లో పనులు వేగంగా సాగుతున్నాయి. కె. పెంటపాడు ఎస్ డబ్ల్యూపీ స్కూల్‌లో అధికశాతం బడుగు, బలహీనవర్గాలవారే. ఈ గ్రామంలో గతంలో ప్రాథమిక స్థాయిలోనే విద్యనభ్యసించి మధ్యలో చదువుకు స్వస్తిచెప్పేవారు. అయితే నేడు జగనన్న ప్రవేశపెట్టిన పథకాలతో పట్టణాలకు వెళ్లి విద్యనభ్యసించే వారి సంఖ్య కన్నా స్వగ్రామంలో చదువుకొనే విద్యార్థులు పెరుగుతూ వస్తున్నారు. అంతే కాకుండా నిష్ణాతులైన ఉపాధ్యాయులు పాఠశాలలో ఉండటం ఇంగ్లీషు విద్యను సైతం అందుబాటులోకి తీసుకురావడంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. గతంలో 60 కన్నా తక్కువ ఉన్న విద్యార్థుల సంఖ్య నేడు 80 కు చేరింది.

5వ తరగతి వరకు ఉన్న పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. అదే విధంగా పలు హైస్కూల్‌లో ఈ ఏడాది 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ టాబ్‌లు పంపిణీ చేయడంతో వీటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా మండల స్థాయిలో పాఠశాల విద్యార్థినులు మందజవేస్తున్నారు. దీనిద్వారా విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రూపురేఖలు మార్చారు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ రూపురేఖలు మార్చారు. గ్రామాల్లో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. దీంతో బడుగు, బలహీనవర్గాలకు నాణ్యమైన విద్యను అందించడంలో సీఎం జగన్నన్న సఫలీకృతం అయ్యారు. విద్యావ్యాప్తికి, పాఠశాలలకు సహాయసహకారాలు అందిస్తున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

– బొచ్చెల తాతారావు, ఎంపీటీసీ సభ్యులు రావిపాడు

ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలకు



ప్రేవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులు వస్తున్నారు. ఇక్కడ మధ్యాహ్నభోజనం, అమ్మఒడి తదితర సదుపాయలు కల్పించడంతో పాటు, సాంకేతికంగా ముందజ వేయడానికి 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు సహితం అందించారు. దీనిద్వారా ఇంటివద్ద పేరెంట్స్ సంతోషపడుతున్నారు.

– ఏవీఎస్‌వీ ప్రసాద్, బేసిక్‌స్కూలు హెచ్‌ఎం, పెంటపాడు

మా స్కూల్‌లో మార్పును మేము ఊహించలేదు



ప్రేవేట్ స్కూల్ కన్నా ప్రభుత్వ బడి భాగుంది. ఇక్కడ స్కూలు యూనిఫాం, బ్యాగులు, పుస్తకాలు, షూ ఇస్తున్నారు. రోజుకోరకమైన ఆహారం పెడుతున్నారు. గతంలో ఇక్కడ మట్టి ఉండేది. ఇప్పుడు గ్రౌండ్ అంతా ఎంతో బాగుంది. వర్షంలో కూడా ఆడుకొంటున్నాము.

–బొబ్బిలి యామిని శ్రీ భవాని 8వ తరగతి జట్లపాలెం ప్రాథమికోన్నత పాఠశాల

ప్రారంభమైన పెంట్లమ్మ జాతర ఉత్సవాలు





పెంట్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద దర్శనాలు కోసం వేచియున్న భక్తులు అమ్మవారి పూరిగుడి వద్ద ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

పెంటపాడు: మండలంలోని పెంట్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తెల్లవారు జాము నుంచే అమ్మవారి దర్శనాల కోసం భారీ సంఖ్యలో భక్తులు పూరిగుడి, మెట్టినిల్లెన్ర సంగంమేడ ప్రాంతాల వద్ద ఉన్న ఆలయాలకు భక్తులు పోటెత్తారు. భక్తులు అమ్మవార్లకు సాంబ్రాణి, సారె, చీరె, పసుపు, కుంకుమ, వడపప్పు, పానకాలు పసుపు నీళ్ల కావిళ్లతో సమర్పించారు. ఆలయాల చుట్టు ప్రదక్షిణలు చేశారు.

రాత్రి అమ్మవారి పొలిచేట గ్రామ వీధుల్లో తెల్లవారు వరకు తిప్పారు. ఈ సందర్భంగా ఆసాదుల నృత్యాలు, తీన్ మార్ డప్పులు, బాణసంచా కాల్పులు, గరగనృత్యాలు, కాళికా వేషధారణలతో గ్రామం రాత్రంతా మారుమ్రోగింది. ఉదయం ప్రతి వీధిలో కావిళ్ల ఊరేగింపులు ఘనంగా జరిగాయి. ఆలయ కమిటి అధ్యక్షులు కొవ్వూరి లక్ష్మణరెడ్డి పర్యవేక్షణలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామంలో పోలీసు బందోబస్తు భారీగా నిర్వహించారు. పూరిగుడి వద్ద అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం గ్రామంలో నైవేద్యాల కార్యక్రమం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. కాగా శుక్రవారం సాయంత్రం నుంచే గ్రామంలో జాతర సందడి నెలకొంది. ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి భక్తులు ఈజాతర ఉత్సవాలకు భారీగా హాజరయ్యారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు



వృద్ధులకు మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అమ్మనాన్న సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక యాగర్లపల్లి ప్రేమాలయం ఆశ్రమంలోని వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వృద్ధులకు, స్త్రీలకు ఆరోగ్య సూత్రాలను వెల్లడించారు. అత్యవసరమైన వారు తప్పనిసరిగా ఏరియా ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. సంస్థ అధ్యక్షుడు వర్రే కోటేశ్వరరావు, సర్వేష్, మహ్మద్ కపర్థి, హోం నిర్వాహకులు బాబ్జీ, రాకుర్తి కిరణ్ కుమార్, జి.లక్ష్మి పాల్గొన్నారు.

పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

అత్తిలి: పదవ తరగతి పరీక్షా ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఈ పరీక్షల్లో తణుకు, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మండల పరిధిలో 70 శాతం ఉత్తీర్ణత సాధించారని మండల విద్యాశాఖాధికారి డి శారదాజ్యోత్స్న తెలిపారు. అత్తిలి మండలంలో 387మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 271 మంది ఉత్తీర్ణులయ్యారు.

62 శాతం ఉత్తీర్ణత

పెంటపాడు : మండల పరిధిలో పదో తరగతి విద్యార్థులు 62శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో 574మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 322 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రైవేట్ స్కూల్లో 125మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 116 మంది ఉత్తీర్ణులయ్యారు. పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో అలంపురం టీబీఆర్ స్కూలు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపరచినట్లు స్కూలు వ్యవస్థాపకులు తనుబుద్ధి బోగేశ్వరరావు తెలిపారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులను ఈ సందర్భంగా అలంపురం స్కూల్లో సంస్థ చైర్మన్ భోగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించి పుష్పగుచ్చాలు ఇచ్చారు. పదోతరగతి పరీక్షల ఫలితాలలో అలంపురం వి/ జన్ స్కూలు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరచినట్లు స్కూలు డైరెక్టర్ గుణ్ణం చిరంజీవి తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులను స్కూల్ యాజమాన్యంతో పాటు, పెంటపాడు ఎంపీపీ దాసరి హైమావతి, ఇన్‌చార్జి ఎంపీడీవో టీవీ సత్యనారాయణ, ఎంఈవో ఎం. శ్రీనివాస్ తదతరులు ప్రత్యేకంగా అభినందించారు.

59 శాతం ఉత్తీర్ణత

తణుకు అర్బన్ : మండలంలో 327 మంది పరీక్షలు రాయగా 192మంది ఉత్తీర్ణులయ్యారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తణుకు రూట్స్ స్కూల్ 162 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 94 మంది విద్యార్థులు 500 మార్కులుపైగా సాధించినట్లు వివరించారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను స్కూలు డైరెక్టర్స్ ఎల్‌కే త్రిపాఠి, బి.విద్యాకాంత్, ఎన్. సుధాకర్‌వర్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

52.62 శాతం ఉత్తీర్ణత

తాడేపల్లిగూడెం రూరల్ : మండలంలోని ఆరుగొలను, పెదతాడేపల్లి డా.బీ.ఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయాలు మినహా 14 పాఠశాలల నుంచి పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 52.62 శాతం ఉత్తీర్ణత లభించింది. మొత్తం 762మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 401 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయ నుంచి 89మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 77మంది ఉత్తీర్ణులై 86.51 శాతం ఫలితాలను సాధించింది.

పట్టణంలో

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని నియోజకవర్గ స్థాయిలో కూడా విద్యార్థులు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. మునిసిపల్ పాఠశాలలకు సంబందించి సుబ్బారావుపేట 70 శాతం, తాళ్ళ ముదునూరుపాడు మాగంటి అన్నపూర్ణదేవి స్కూల్ 63 శాతం, యాగర్లపల్లి మహాత్మాగాంధీ స్కూల్ 55 శాతం, సంజీవనగర్ ఈలి ఆంజనేయులు స్కూల్‌లు 55 శాతం, కొబ్బరితోట ఈవీఎం స్కూల్ 46 శాతం , కడకట్ల కోడే వెంకట్రావు స్కూల్ 42 శాతంతో ఉత్తీర్ణత సాధించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల 48 శాతంతోను, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల 20 శాతంతో ఉత్తీర్ణత సాధించారు.

ఇరగవరం మండలంలో

ఇరగవరం : మండలంలో 518 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 249 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

50.5శాతం ఉత్తీర్ణత

తణుకు టౌన్: పదవ తరగతి పరీక్షల్లో తణుకు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 50.5 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని మొత్తం 823 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 416 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

వేల్పూరులో భారీ అన్నసమారాధన



వేల్పూరులో వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి కారుమూరి



వెంకటేశ్వరస్వామి వారి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి 53వ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామి వారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాలు ముగింపు సందర్భంగా శనివారం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్, ఆలయ అర్చకులు, సభ్యులు ఆలయ మర్యాదలతో మంత్రి కారుమూరి పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, ఆలయ కమిటీ చైర్మన్ గుణ్ణం రంగారావు, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, నున్న దుర్గ ప్రసాద్‌లతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వేల్పూరు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

భారీ అన్న సమారాధనలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద వెంకటేశ్వరస్వామి వారి కల్యాణం పురస్కరించుకొని ఆలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామివారికి విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ కూనిరెడ్డి శ్రీనివాస్ పర్యవేక్షించారు. అదే విధంగా సుబ్బారావుపేట శ్రీనివాస రామాలయంలో తొలుత విశేష పూజలు, స్వామి వారిని విశేషంగా అలంకరించారు. అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు శానం రామకృష్ణ పర్యవేక్షించారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



తిరుపతిపురంలో ఉపాధి కూలీలలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

అత్తిలి: కూలీలకు సంజీవని వంటి ఉపాధిహామీని దెబ్బకొట్టే విధానాలు ఆపకపోతే మోదీ ప్రభుత్వానికి కూలీల నుంచి ప్రతిఘటన తప్పదని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం అత్తిలి మండలం తిరుపతిపురం గ్రామంలో ఆరుదలకోడులో పనిచేస్తున్న ఉపాధి కూలీలను వీరభద్రరావు కలిసి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా వేసవిలో ఉపాధిహామీలో పనిచేస్తున్న కూలీలకు ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ప్రభుత్వం అధనంగా చెల్లించే వేసవి అలవెన్స్ సొమ్మును ఈఏడాది కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం దుర్మార్గమని అన్నారు. పాత పద్ధతిలోనే ఉపాధి పనులు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంపన రాజు, మల్లుల పావని, వింజమూరి చంద్రకళ, ఉండ్రాజవరపు రాణి, గుడాల వరలక్ష్మి, పంపన జ్యోతి, చెల్లబోయిన దుర్గ భవాని, దొంగ వెంకటేశ్వర్లు, మీసాల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పంట నష్టపరిహారాన్ని వెంటనే విడుదల చేయాలి

ఉండి : మండలంలోని తడిసిన ధాన్యాన్ని, అలాగే పంట నష్ట పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఉండిలోని వరిచేలను, ధాన్యపు రాసులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులంతా రాబోయే రోజుల్లో అధిక వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందుకు ధాన్యాన్ని త్వరగా ఒబ్బిడి చేసుకోవాలంటూ సూచించారు. అలాగే రైతుల వద్ద నుంచి యుద్ధ ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులపై బీజేపీ చార్జిషీట్లు

సాక్షి, భీమవరం: అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీ అమలు, పరిపాలనలో వారి వైఫల్యాలపై చీటింగ్ కేసులు నమోదు చేయాలని పోలీస్ స్టేషన్స్‌లో వారిపై చార్జీ షీట్లు రూపంలో ఫిర్యాదుల ఉద్యమం చేపట్టనున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ, క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర చైర్మన్ పాకా సత్యనారాయణ చెప్పారు. భీమవరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కొంతకాలంగా అధికార పార్టీ పట్ల బిజెపి మెతక వైఖరి అవలంబిస్తుందనే ప్రచారం నిజం కాదన్నారు. అందువల్లనే వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, పాలనపై చార్జిషీట్ల రూపంలో వారిని ప్రజా కోర్టులోకి పిలవాలని బీజేపీపార్టీ నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమం శనివారం ప్రారంభమై 15 రోజులు పాటు సాగుతుందన్నారు. ఈ సమావేశంలో బిజేపీ నాయకులు కోమటి రవి కుమార్, అడబాల శివ, కాయిత సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు



స్వామి వారికి చక్రస్నానం చేస్తున్న వేద పండితులు

కాళ్ల : మండలం కాళ్లకూరు గ్రామంలోని వేంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి నిత్యాపాసన, బలిహరణ, పంచసూక్త హవనం, మహా పూర్ణాహుతి, స్వామివారి పద్మావతి సరోవరంలో వసంతోత్సవం, పంచామృత అభిషేకం, చక్రస్నానం నీరాజన మంత్రపుష్ప ప్రసాద వినియోగం చేశారు. రాత్రి ధ్వజ అవరోహణ, చోరోత్సవం అనంతరం అశ్వవాహనంపై స్వామివారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ దండు వెంకట కృష్ణంరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్, గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన చెన్నకేశవుని కల్యాణోత్సవాలు

ఉండి: ఉప్పులూరులో చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవాల ముగింపు వేడుకను శనివారం ఘనంగా నిర్వహించారు. చక్రతీర్థం, వసంతోత్సవాన్ని నిర్వహించిన అనంతరం ఆలయ ఆవరణలో చెన్నకేశవస్వామి సేవా సమితి, గ్రామ ప్రజల సహకారంతో అఖండ అన్నసమారాధనా కార్యక్రమాన్ని నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యర్రా వెంకటసుబ్బారావు, ఎంపీటీసీ నిమ్మల కేశవ్‌కుమార్, ట్రస్ట్ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.